

# గరియేబవాదా!

## వీరాజీ

రాత్రి పన్నెండు గంటలదాకా పడమటి సూర్యుడు ఆ హోటలు గాజుగోడ లోంచి నా కళ్లలో పొడుస్తూనే వున్నాడు. నిద్రపట్టిందే కాదు. ఉదయం యింకా ఆరుగంటలేనా కాలేదు– అరుణోదయమై పోయింది. మూడు దొంతరలున్న ఆ పరుపుమీద పడుకొని, బద్ధకంగా, చిరాకుగా కళ్లుతెరిచి చూసేసరికి రీగా నగర అంబరవీధులలో సూర్యకాంతులు మేఘాలతో దోబూచులాడుతున్నాయి. నేను కప్పుకున్న రగ్గును మోకాళ్ల దాకా క్రిందికి తోసేశాను. కానీ, నన్నావరించిన వంటరితనాన్ని ఎలా విదిలించుకోడం? అది ఎనిమిదంతస్థుల హోటలు. నే నున్న గదిగోడ మొత్తం అంతా ఏకాండీ గాజుతోనే కట్టేరు. అందులోనుంచి చూస్తే హోటల్‌కి వందగజాల దూరంలో స్నిగ్ధంగా ప్రవహిస్తున్న 'దావుగావా' నది, దాని వెనకగా చరిత్రాత్మకమైన అందాల 'రీగా' నగరం– నీరెండలో మిలమిల లాడిపోతున్నాయి. అయితే, అన్నిటిమీదా తిష్ఠవేసుకుని వున్న నిశ్శబ్ద బద్ధకం నన్నుకూడా ప్రభావితం చేసినట్లుగా వుంది. ఏదో చెప్పలేని వెల్తిగా వుంది.

సంపూర్ణ పారదర్శకం అయిన ఆ గాజుగోడ కవతల కొండలమధ్య శిఖరాగ్రంలాగ– తీర్చిదిద్దిన మేడలమధ్య తొంభైమీటర్ల ఎత్తున డోమ్ కేథడ్రిల్ (చర్చీ) దాన్నెత్తిమీద గాలి కోడిపుంజు కనబడుతున్నాయి. మేఘాలతో మేల మాడుతున్నట్లున్న ఆ 'వెదర్‌కాక్'ని చూస్తూ, "హలోవ్! గుడ్‌మాణింగ్–" అన్నా న్నేను.

అది లాత్వియా దేశంలో, రాజధాని 'రీగా' నగరంలో ఒక ఉదయం. లాత్వియా– సోవియట్ రష్యాలోని పదిహేను రిపబ్లిక్‌లలో ఒకటి. ఈ హోటల్ పేరుకూడా 'హోటల్ దావుగావా'వే!

ఓ కప్పు 'బెడ్‌కాఫీ' తాగాలనిపించింది. రూమ్‌లో అటూయిటూ చూసేను. టెలివిజన్ వుంది. ప్రక్కనే రేడియో వుంది; డస్కుమీద రెండు టెలిఫోన్లు పెట్టున్నాయి. కాని ఎనిమిది గంటలయితే గానీ టెలివిజన్ తెర కదల్దు. అందమైన అమ్మాయి చేసే వ్యాయామ విన్యాసాలతో టెలివిజన్‌మీద ఉషోదయం కావడానికింకా రెండుగంటల వ్యవధుంది. నిన్న రాత్రి ఒంటిగంటదాకా "డాన్స్‌ఫ్లోర్" రెస్టారెంటులో హాయిగా తాగుతూ, మజాగా తింటూ, తాపీగా ఆడామగా కలిసి సరదా కబుర్లు చెప్పుకుంటూ, మధ్యలోవున్న సర్క్యులర్ స్టేజిమీద జరుగుతున్న సంగీత నృత్య కదంబ కార్యక్రమాన్ని వీక్షిస్తూ– అలిసిపోయిన జనం, యిప్పుడు గాఢనిద్దర్లో వుండి వుంటారు. ఇది ఐరోపా ఖండం– యిక్కడిదంతా యూరోపియన్ కల్చర్ కదా!

లేచి, కూర్చుని టెలిఫోను అందుకున్నాను. కాని, ఎక్కడికి డయలు చెయ్యడం? ఎవరికి 'రింగ్' చెయ్యడం?? టెలిఫోన్ క్రిందవున్న కార్డ్‌మీద రష్యన్ భాషలోనూ, యింగ్లీషు లిపితోనే రాసే లాత్వియన్ భాషలోనూ, జెర్మన్ భాషలోనూ కూడా కొన్ని టెలిఫోన్ నెంబర్ల లిస్ట్ వుంది. అందులోనుంచి, నా కప్పటికి తోచిన నెంబరొకటి తీసి డయల్ చేశాను. గాజుగోడ కవతల స్తబ్దుగావున్న నగరంలో చిన్న పిసరు చైతన్యం కనబడుతున్నది. టెలిఫోన్ "గాఁయ్.... గాఁయ్" మంటూంది గానీ, అవతలెవరూ ఎత్తటంలేదు. అయినా వంటరితనపు వెల్తిని భర్తీచెయ్యడాన్కి ఏదో ఒకటి చెయ్యాలి కదా! ఆంధ్రాకి అయిదువేల కిలోమీటర్ల దూరంలో వున్నాన్నేనిప్పుడు. టెలిఫోన్ హుక్‌మీద పడేసి, ఒకసారి వొళ్లు విరుచుకుంటూ, గాజుగోడ దగ్గర నిలబడి దావుగావా నదీ తీరంవైపు దృష్టి సారించాను. 'వందేమాతరం' అని గట్టిగానే దేశాన్ని తల్చుకున్నాను. "సుజలాం, సుఫలాం మాతరం" అనుకుంటూ ఆవలించేను. దావుగావా తీరమంతా పచ్చిక మెత్తల మధ్య, పూల మొక్కలతో తీర్చిదిద్దబడి వుంది. ముగ్గులొక్కటే తక్కువ. నదీతీరం

మెట్లన్నీ కడిగి శుభ్రంచేసినట్టున్నాయి. ఒకజట్టు "హంసబాతు"లు యీదుకుంటూ, ఉత్తరంగా పోయే నదిమీద తూర్పు పడమరలుగా వున్న రోడ్డు వంతెన క్రిందికి ఉరకలు వేస్తున్నాయి. దూరంగా 'మాస్కావాఅయిలా' (మాస్కో వీధి) మీద మోటారు శకటాలు కదులుతున్నాయి.

విశాలంగా, శుభ్రంగా, ప్రశాంతంగా వున్న రోడ్లవార, పార్కింగ్ ప్లేసుల్లో కార్లూ, వ్యాన్లూ- ఒంటికాలుమీద నిలబడి కునుకుతీసే జట్కాగుర్రాల్లాగ పడివున్నాయి. దూరంగా, రాజమార్గాలలో, ఒకటీ, అరా ట్రాలీ బస్సులు అంటే ఎలక్ట్రిక్ బస్సులు ఫ్యాక్టరీ వర్కర్లని ఎక్కించుకుని కదులుతున్నాయి.

ముసలమ్మలు స్వెటర్లు తొడుక్కుని కందికంపలాంటి కంపతో కట్టిన పొడవాటి చీపుళ్లతో వీధులూడుస్తున్నారు. పైనుంచి చూస్తుంటే, వూరంతా వో బొమ్మల కొలువులో తీర్చిదిద్దినట్లు కనబడుతోంది.... మధ్యమధ్య పార్కులు, పెంచిన అడవులు.... కనులపచ్చగా, ఆహ్లాదకరంగా వుంది.

దావుగావా నదీమతల్లిని మన కృష్ణా, గోదావరీ నదులతో పోల్చుకుని- మాతృదేశాన్ని తల్చుకోవాలనుకున్నాను. కానీ యీ నదివొడ్డున కాలకృత్యాలు తీర్చుకునే దృశ్యాలు, ముఖప్రక్షాళనాలు, స్నానాలు చేస్తున్న దృశ్యాలు లేవు. పావురాలు, యింకేవో పేరు తెలియని పిట్టలు- నీరెండలో ఆడుకుంటున్నాయి. చేపలుపట్టే సరదా వున్న ఒకరిద్దరు రిటైర్డు బాపతు పెద్దమనుషులు, నదిలో కాళ్లు పెట్టకుండా, దూరంగా మెట్లమీద కూర్చుని, మరగాలం విసిరి చేపలకోసం నిరీక్షిస్తున్నారు. ఒకరిద్దరు యువకులు చెడ్డీ బనియన్లతో వ్యాయామంకోసం పరుగులు తీస్తున్నారు. అద్దాలలోనుంచి చూస్తూంటే, సైలెంట్ వర్ణచిత్రం లాగుంది అంతా!

కిటికీలు తెరిచినా అంతగా గందరగోళం వుండదు.... ఎందుకంటే, కార్లు హారన్లు కొట్టవు. పోలీసులు యీలలు వెయ్యరు. ఓవర్‌టేకింగ్‌లు, సినిమా పాటల ప్రకటనల బళ్లు, ఆటోరిక్షాలు గట్రా మచ్చుకి కూడా లేవు. మోటారు సైకిళ్లు కూడా సిటీలో తిరగకూడదు.... శబ్దకాలుష్యంలేని ఆ దృశ్యంమీదనుంచి నా మనసు మళ్లీ బెడ్‌కాఫీ మీదికి పోయింది.

మళ్లీ టెలిఫోన్ ఎత్తి, యిన్‌ఫర్మేషన్ డెస్క్ నెంబర్ అని నేను భావించిన నెంబర్ డయలు చేశాను. కాఫీ తాగాలి, ఆనక పేపర్ చదవాలి.... బాత్రూంలో దూరాలి- కాని, ఏ పేపర్ చదవగలం? లాత్వియా భాష పేపర్లు యింగ్లీషు లిపిలోనే వుంటాయి గాని- ఒక్కమాట కూడా కొరుకుడు పడదు. పార్క్, హోటల్, రివాలాంటి మాటలు తప్ప. ఫోన్ "గాంయ్.... గాంయ్" అనడం ఆగింది. అమ్మయ్య.... ఎవరో ఎత్తుకున్నా రవతలపక్క- "గుడ్ మార్నింగ్! నాకు కొంచెం సమాచారం కావాలి, ఇవ్వగలరా?" అంటూ యింగ్లీషులో అడిగాను. అవతలినుంచి కంచుగంటలాంటి ఆడపిల్ల కంఠం 'కంయ్ కంయ్' మంటూ వినబడ్డది. లాభం లేదనుకొని తెలుగులోనే- "నేను యిండియానుంచి వచ్చిన పెద్దమనిషిని. హిందూ రూసీ భాయీభాయ్! నాకు కాఫీలాంటిది కావాలి. నా చొక్కా, కోటూ యిస్త్రీచేయించి తెచ్చిపెట్టడానికి రూమ్ బోయ్ ఒకడు కావాలి. దొరుకుతాడా?" అంటూ అడిగాను. (అర్థం కానప్పుడు ఏ భాష అయితేనేం?)- అవతలి కంఠం- రాంగ్ స్పీడ్‌లో పడ్డ గ్రామఫోను రికార్డు చేసే కఁయ్ఁ కఁయ్ఁ సౌండందుకుంది. నా చెవుల తుప్పొదిలిపోయింది. (విశాఖపట్నం రెల్లిదాయిలాగ ఛెడామడా తిడుతుందేమో తెలీదు)- బహుశా "నీ భాష గందరగోళంగా వుందయ్యా" అన్నదో, లేకపోతే, "రష్యన్ భాష నేర్చుకుని రావయ్యా" అన్నదో- మొత్తానికి వో నిముషం, లయవిన్యాస శుభోదయం పలికి, రిసీవర్ పడేసింది....

నా "దుబాసీ శ్రీ" వున్నాడుగా, క్రింది అంతస్తులో.... అతనికి డయల్ చేశాను (పక్కరూము అయినా, డైరెక్ట్ డయలింగు టెలిఫోనులే వుంటాయి రష్యాలో) వూహుఁ.... సమాధానమిల్లై....

నిన్న "సాయంకాలం" పదకొండు గంటలదాకా (సూర్యాస్తమయం 12 గంటలకి మరి) నేనుకూడా, డిన్నరుహాలులో, పచ్చి టమోటా ముక్కలు తింటూ, పెప్సీకోలా పీలుస్తూ - మన జ్యోతిలక్ష్మిమార్కు కాబ్రే డ్యాన్సులు చూస్తూ గడిపాను. కాని బోర్‌కొట్టి, మా "దుబాసీ శ్రీ"కి 'గుడ్‌నైట్' చెప్పేశాను. మనవాడు కొన్యాక్ ఫ్రెంచిబ్రాందీ తాగుతూ పోర్క్, బీఫ్ వగైరాలేవో తింటూ, అమెరికన్ మార్ల్‌బోరోమార్క్ సిగరెట్‌లు తెగపీలుస్తూ గడిపి, రాత్రి యే రెండింటికో రూమ్‌చేరుకుని వుంటాడు. అప్పుడు 9-30 అయితేగానీ ఆవలించడు.

"బెడ్‌కాఫీ కావాలా సార్?" అంటూ ఎవరూ పల్కరించరని నాకు తెలుసు. అది కావాలంటే యీ అంతస్తులోనూ, ప్రతీ అంతస్తులోనూ వుండే ఫ్లోర్‌రెస్టారెంటుకెళ్ళాలి. క్యూలో నిలబడి, బ్లాక్‌కాఫీ వితౌట్‌సుగర్ + పంచదారబిళ్ళలు తెచ్చుకుని, బుద్ధిగా టేబిల్‌మీద పెట్టుకుని తాగాలి.... అంతా సెల్ఫ్ సర్వీసు దేశం యిది!

ఇలా ఆలోచిస్తూ, ప్రక్కనే వున్న నిలువుటద్దంలో నా బొమ్మ చూసి, నేనే వులిక్కిపడ్డాను. నవ్వేసి - మళ్లీ సీరియస్‌గా మిర్రర్‌లోకి చూసుకున్నాను.

"అద్దంలో నీ బొమ్మ చూడూ .... అది కమ్మని మాటలు ఆడూ...." అన్నట్లు అనిపించింది. అద్దంలోని నా "బొమ్మ కమ్మని మాటలేం ఆడలేదు గానీ, నన్ను చూసి, "ఇహీ" మంది. (నవ్వేందన్న మాట)

"మూగాడి వైపోయావ్! నీకు రష్యన్ భాష రాదా?" అడుగుతున్నాడు అద్దంలోని "నేను."

"ఎందుకురాదూ? నేర్చుకొనే టైము లేదు...కొంచెంకొంచెం మాలూమ్ హై... కావాలంటే విను.... 'జ్ద్రాస్త్వివిచే' అంటే హలోవ్ అని అర్థం. 'కాక్ జిలా' అంటే బాగున్నారా? అని 'ఓవేషి' అంటే కాయ గూరలు. మిల్ఖో అంటే పాలంగడి. 'రేషంకా' అంటే పెరుగు, కిఫిర్.... అనగా...."

"ఇక నోర్మూసుకో" అంది నాబొమ్మ. "ఇంగ్లీషు వొచ్చునన్న వెధవ గర్వమూ నువ్వూ .... ఇప్పు డేమయ్యావ్? నీ కోటూ, చొక్కా విన్న సూట్ కేసులో - ప్రయాణం హడావుడిలో - నలిపేసి కుక్కేశాడు నీ మిత్రుడు దుబాసీ- దాన్ని యిస్త్రీ చేయించుకో చూద్దాం" అన్నాడు అద్దంలోని "నేను." పైగా లాత్వియన్ లాగ నవ్వటానికి ప్రయత్నం చేస్తు న్నాడు- "నాకు లాత్వియా భాష వచ్చినా బాగుణ్ను-" డ్రాయర్ మీద నేను మింగ లేక పడేసిన నాన్ రొట్టి చుట్టలు చుట్టలుగా వున్నది పడిఉంది. ప్రక్కనే ఇండియా... ఐయామ్ సారీ ఆంధ్రా – ఓ....సో, సారీ.... మన బెజవాడనుంచి తెచ్చిన నెస్కేఫీ ప్యాకెట్ వుంది. రొట్టె చూస్తే డోకొచ్చింది కాని, కాఫీప్యాకెట్ చూస్తే- వేణ్ణీళ్ళుంటే బాగుణ్ను అందులో దీన్ని మిళాయించినన్....అహా...డిడీర్ అనగా యిన్ స్టెంట్ కాఫీ తయారగునుగా" అన్నాను అద్దంలోకి చూస్తూ. గొప్పగా "అగును బొమ్మా" అన్నాడు చెయ్యి విది లించి అద్దంలోని నేను.



అవతల చలిగా వుంది...కారిడార్ లోకి తొంగిచూశాను....యింకా ఫ్లోర్ సూప ర్నెంటమ్మకూడా రాలేదు. రెస్టారెంటులో ఏమీ సందడిలేదు.

బాత్రూంలోకి వెళ్లాను....క్లోరినేటిడ్ వాటర్ అయితేనేం.... వేణ్ణీళ్ళు వస్తాయి కదా.... హాట్ వాటర్ టాప్ యిప్పేను. వేలు చురుకుతుందేమోనని, తాపీగా దాని క్రింద పెట్టేను.... చురుక్ మంది. కాని, యిది వేడి కాదు....చలి- హాట్ వాటర్ కి బద్ధకమే. ఇంకా వేళకాలేదో యేమోనను కున్నాను. దంతావధానం ముగించాను... ఛీ.... ఛీ.... యిన్నాళ్ళ నుంచీ యీ అయిడియా రాకపోయింది. నాలుగు పేకెట్లు ఇన్ స్టెంట్ కాఫీ సావనీర్ లుగా (జ్ఞాపక చిహ్నాలుగా) పంచిపెట్టేశాను. బ్లాక్ కాఫీకి, యీ పది రోజులలోనూ అలవాటుపడ్డాను.... హాయిగా కలుపుకొని తాగితే పోలా....?

అద్దాల కిటికీ తెరిచాను కాస్త.... 'దావుగావా నది' రొదను మించిపోయి నగరం హోరుమంటోంది- చలి విరిగిన

గాలి ముక్కులనిండా పీల్చుకుని, "స్పసీబా మిత్రమా.... నాకు వేణ్ణీళ్లు దొరికాయో .... కాఫీ రెడీచేస్తానోయ్ నీకు," అన్నాను వెనుదిరిగి మిర్రర్‌లోకి చూస్తూ.

"స్పసీబా అంటే రష్యన్ భాషలో ధన్యవాదాలు అని తెల్సులేవోయ్.... కాని, లాత్వియన్ భాషలో ఏమంటారో అడుగు మీ దుబాసీని"-అన్నాడు అద్దంలో నేను.

మన కామ్రేడ్‌కి, అంటే దుబాసీ క్కూడా లాత్వియా నై అతా హై. అందుకే రష్యన్ భాష బాగా వచ్చుగా- అంతా 'స్పసీబా' అంటారు. నేనూ అలాగే "బార్సాతీన్"లో రాజకపూర్ లాగా కొంచెం ముందుకి వొంగి యిలా 'స్పసీబా' అంటాను- అంటూ 'ఎయిర్ యిండియా మహారాజులాగా ముందుకి వొంగి ఏక్షన్ చేశాను.... పది గంటలకి లాత్వియన్ యూనివర్సిటీలో మహాశిల్పి ఈగార్ వాసిల్యేవ్‌తో- అప్పాయింట్ మెంటు వుంది.... అది చూడు ముందు, అనక 'స్పసీబా'.... అద్దంలోని నా 'బొమ్మ' భృకుటి ముడిచింది- నేను బాత్రూమ్‌లోకి దూసుకున్నాను. ఈ దుబాసీ అనవసరంగా నా చొక్కాల్ని- అడ్డదిడ్డంగా సూట్‌కేస్‌లో కుక్కేయక పోతే, నాకు 'దోబీ'గారు ఐ మీన్ యిస్త్రీగారు అక్కర్లేదు గాని- విమానానికి పైపైపోతోందోనంటూ పెట్టి సర్దుకోడం కూడా రాని నా యిండియన్ కల్చర్‌ని తిడుతూ- 'దుబాసీ శ్రీ'-పెట్టి సర్దాడు.... నే నేడుపుమొహం పెట్టి, 'స్పసీబా' అన్నాను. యీ దావుగావా నదీతీరానగల రీగా నగరం నడిబొడ్డున మహాహోటల్ లోపల- యెట్లు? యిస్త్రీ కావలెనని అడుగుటెట్లు ? కాఫీ కాచుటెట్లు? బాత్ టబ్ లోకి హాట్‌వాటర్‌టాప్ వొదిలి- గెడ్డాంచేసుకుంటూ (గీసుకుంటూ అనాలి తెలుగులో) ఆలోచిస్తున్నాను.

అందరూ స్త్రీలే .... అయితేనేం ఆ స్త్రీలను యిస్త్రీ కావాలని అడుగుట ఎట్లో తెలియడంలేదు కాని, ఎటు చూసినా చక్కగా అతివలే అన్ని పనులూ చేస్తున్నారు. ముచ్చటగా వుంది.

స్వీపర్‌గర్ల్ వస్తుందేమోనని చూస్తే- మనం రూమ్‌లో వుండగా స్వీపర్‌గాళ్ రాదుట! హాయ్ 'అల్లా గాడ్ పరమాత్మా.' (దేశ సమైక్యత వర్ధిల్లాలి కదా అందుకని యిలా) అయితే నాకు వేరే డ్రస్‌లున్నాయి వైవర్రీ! అనుకుంటూ నీళ్లల్లోకి దిగాను... అబ్బే దిగలేదు.... దిగుదామని కాళ్లు- కాళ్లు కూడా కాదు.... కాలు పెట్టబోతే జివ్వుమంది.... అవి చన్నీళ్లు- అన్నీ చన్నీళ్లే....బాత్‌టబ్ అంతా....నో హాట్ వాటర్? గరమ్‌పానీ ఆయా నహీ? వేడి నీరు రాలేదా? సూడా తన్నీ వరాదా?.... ఏ భాషలో అంటేనేం? రష్యన్ భాషలో ఆ వొక్క ముక్కా రాలేదుగా.... పీకున్నాడు మా 'దుబాసీ శ్రీ'- ఎందుకు? ఏమీ చెప్పడు. వాడి భాషని రూబుల్సు, కొపెక్కుల్లాగ (రుపాయి పైసల్లాగ) దాచుకుంటాడు. హాట్‌వాటర్ పోసుకో డానిక్కూడా లేదు. చన్నీటి స్నానమా?- కార్తీకస్నానం కూడా ఎన్నడూ చెయ్య లేదే- ఐరోపా ఖండంలోని లాత్వియా లోనా? బాబా! చన్నీటి స్నానం.

కాని, యిది రెండు దేశాల మైత్రికి, అంతర్జాతీయ సహకారానికి, అవగాహనకి సంబంధించిన విషయం కనుక- వెంటనే బాత్‌టబ్‌లో 'జిబ్రిష్ భాష'లో దవడలు వొణికిస్తూ ఏవో అంటూ దిగి స్నానం ఆచరించాను....


సూటూ, బూటూ బిగించేసుకోవాలను కున్నాను.... ఏదో సామెత చెప్పినట్లు ఎనిమిది అంతస్తుల దావుగావా హోటల్లో వేణ్ణీటికే కరువా? అనుకుంటూ సీసాలో వున్న నారింజనీళ్లు-నలభై కొపెక్కులు (రష్యన్ పైసలు)తో కొనుక్కున్న ఆరంజి నీళ్లు తాగాను.

అంతలో తలుపు తెరుచుకుంది. మా "దుబాసీ శ్రీ" అనుకున్నాను....కాదు... స్వీపర్ గర్ల్.... తప్పుచేస్తూ దొరికి పోయినవాడిలాగ, టక్కున ఆరెంజ్ వాటర్ బాటిల్ అక్కడ పెట్టేశాను. "యిహీ" అన్నాను. (అవును మరి బ్రాండీ, విస్కీ, జిన్ లాంటివేవో వో గుక్క పట్టుకోకుండా ఐరోపా ఖండం బున యేమీ భారతఖండపు ఉషః పానము?) ఆవిడకి నలభై నలభై అయిదేళ్లుంటాయేమో; లాత్వియన్లు, జర్మనీవాళ్లలాగ ఎర్ర తొక్కలో వుంటారు.... బొద్దుగా వుంది....అంటే ఫ్లోర్‌లేడీ అనగా "సూపర్నెంటమ్మ" కాదు, రూమ్‌లేడీయే అనుకున్నాను.... ఆవిడ గౌనుమీద 'ఏప్రాన్' కట్టుకుంది. చిన్న మీసకట్టు కూడా వుంది. "కాక్ జెల్లా" అన్నాను.

"ఇందియా" అన్నాను. ఆత్మీయంగా నవ్వింది. "బాత్రూం క్లీన్ చెయ్యనా?" అంది సైగలతో- అంతలో నాకో అయిడియా వొచ్చింది.... బల్లమీదున్న చాక్లెట్లు రెండు తీసి ఆమెకి యిచ్చాను... "యిది సావనీర్‌గా వుంచుకోమన్నాను." నా సొరుగులో వున్న యిండియన్ విచ్చ రూపాయి కాసు తీసి యిస్తూ- వెంటనే గ్రహించింది- కాని, చాక్లెట్‌నే (మన అగ్గిపెట్టంత వున్నదాన్ని) అటూయిటూ తిప్పి- 'రుపీకా'.... రూపికా అని తీసి పారేస్తున్నట్లు నవ్వింది.

"అయ్యో! యిది రష్యన్‌దే కదా!... దీన్నిస్తావేమిటోయ్ నాకు మిత్రమా" అన్నట్లు నా కర్థమైంది. వెంటనే నా సూట్‌కేస్ మూత ఎత్తి, మన న్యూట్రిన్ చాక్లెట్లు (చిన్నవి కదా) నాలుగు యిచ్చాను___ ఆమె మొహం నెమలి విసనకర్రలాగ వికసించింది. "స్పసీబా . స్పసీబా" అంటూ ముందుకి వంగి థాంక్సె చెప్పింది.... విచ్చరూపాయి కాసు నటూ యిటూ తిప్పి చూస్తూ, బాత్రూంలోకి

వెళ్ళింది. నే నీలోగా నాకు చాతనైన ఏకైక ధూపం వెలిగించాను. మాంచి అగరబత్తీలు మన యిండియావి నాలుగు పెట్టెలు తెచ్చాను నాతో.... రూములో ఆ విదేశీ వాసన జాగాలో స్వదేశీ వాసన ఘుమఘుమా వచ్చింది— ఈలోగా మన ఫ్రెండు బాత్రూంనుంచి యివతలికి వచ్చింది. ఊదొత్తుల సువాసననీ, ధూపాన్నీ కూడా విచిత్రంగా, హాయిగా చూసింది— మన పిల్లలు జెట్ విమానం చూసినట్లు— 'ఊమ్మ్మ్' అంటూ సువాసనని ఆఘ్రాణించి, వోహో ఎంతో బాగుంది అన్నట్లు రెండు చేతులూ బారజాపి— అభినయించింది.



నాకు గర్వంగా వుంది... మా యిద్దరి మధ్యా ఒక భాష ఏర్పడి వున్నట్లు ధైర్యం వచ్చింది. వెంటనే రెండు వూదొత్తులు అపురూపంగా తీసిచ్చేను. "సావనీర్.... సావనీర్" అన్నాను. ఆ అమ్మాయి వాటి నందుకుని స్పసిబా... అంటూనే పరమానందంగా నాకు షేక్ హ్యాండిచ్చింది. నాకు ఎంతో గౌరవం అందినట్లుగా ఫీలయ్యేను. (మన దేశంలో రూముబోయ్స్‌కి, స్వీపర్స్‌కీ షేక్ హ్యాండు యిస్తామా.... వుహూఁ)

నేను నా చొక్కా, కోటూ వున్న హేంగర్స్ చూపించి— "వీటిని యిస్త్రీ చెయ్యగలవా?" అంటూ సైగలతో.... నా భాషలో నేను మాట్లాడుతూనే (అంటే తెలుగు కాదు యింగ్లీషు అన్నమాట) అడిగేను. నిజానికి నాకు యిస్త్రీ పట్టుదల పెరిగిపోతోంది.... అదో పిచ్చి అయింది.

"వో....యిస్త్రీవా?" అన్నట్లు సంగీత భరితంగా మాట్లాడుతూ (లాత్వియనులు సంగీత ప్రియులు. భాషకూడా వినడానికి వీనుల విందుగా వుంటుంది.) అడిగి.... నేను చేసిపెడతాను.... యిస్త్రీ పెట్టి మరో అంతస్తులో (?) వున్నవాళ్ల దగ్గర వుంది అంటూ చెప్పింది. "నువ్వు బయటికి పోయిరా" అన్నట్లు నాకు అర్థమయింది. మళ్లీ యిద్దరం "స్పసిబా స్పసిబా"లు చెప్పుకున్నాం—

అమ్మయ్య దుబాసీ లేకుండా నేను మేనేజ్ చెయ్యగలను అనుకున్నాను.

టైము తొమ్మిదయింది. టెలివిజన్‌లో న్యూసు అయిపోయింది. ఏదో 'నారెన్, నారెన్నినారా' అంటూ సంగీత నృత్యం వస్తోంది. ఫ్లోరు రెస్టారెంటుకి వెళ్లాను. అప్పటికే క్యూ వుంది— ఫోర్కు, బీఫ్ లాంటివి ప్లేటలో సర్ది అద్దాల బీరువాలో సర్దారు. రెడీగా కాఫీ డికాషన్ పర్కొలేటర్‌లోవుంది. 'కిఫిర్' (మీగడలాంటిది) కాఫీ, పంచదార బిళ్లలు ప్లేట్లతో పంకే తించాను. అంతా సెల్ఫ్ సర్వీసే అక్కడ. రెస్టారెంటు అమ్మడు దగ్గర అవి తీసుకున్నాను.... నల్లని కురులు, కాటుక కళ్లు, తెల్లని దంతపు బొమ్మ లాగ వుంది. నల్లని గౌను, మెడలో ఒక "క్రాసు" వేసుకున్న ఆ అమ్మాయి (గవర్నమెంటు ఉద్యోగిని అయినా, ఆ పిల్ల యిష్టం అమెదన్నమాట)— నేనో రూబుల్ కాయితం యిచ్చాను. చిల్లరతీసి, బల్లమీద పరిచి, లెక్కపెట్టి నా వేపు త్రోసింది—

అంతా నిశ్శబ్దంగా వుంది. కాఫీ దుకాణం రొణగొణధ్వని లేదు. ఓ బల్ల దగ్గర కూర్చున్నాను. కాఫీ డికాషన్ చల్లారిపోతోంది. ప్రొద్దున్నే 'కిఫర్' తిందామా? అంటే గొంతులోనుంచి దిగ నంటోంది. పంచదార బిళ్ల ఒకటి డికాషన్‌లో వేశాను. చెంచాతో కలిపితే, అది చల్లారిపోతుంది.... చలిదేశం కదా! నా ఎదురుగుండా బామ్మగారు ఒకామె కూర్చునుంది. కాఫీ తెచ్చిపెట్టుకుని, చెంచాతో పంచదార బిళ్ల కరిగేలా తిప్పుతూనే, నా వేపు అప్యాయంగా, వాత్సల్యంగా చూస్తోంది. విచిత్రమే! వేడిదేశం మనది. అన్నీ వేడిగా కావాలో అని గోలపెడతాం మనం.... అలాగే యీ చలిదేశం వాళ్లు అన్నీ చల్లగా తింటూంటారు!

ఈ బామ్మగారు "పూలస్కార్ఫ్" తలకి చుట్టుకుంది. ముగ్గుబుట్ట అయిపోయిన తల, ముడుతలుపడ్డ మొహం. కానీ, పెదాలు విప్పకుండా, సన్నని నవ్వుతో ఆమె పలకరించే తీరు—"ఈమెనే కదూ నిన్న ఉదయం లగేజీకీపర్ రూములో చూశాను" అని నాకు జ్ఞాపకం చేసింది.

"జ్డ్రాస్త్వవిచే" అన్నాను— వెంటనే

జ్ఞాపిస్తవిచే అంటూ బోసినోటితో ఏమో చెప్పింది .... వెర్రిమొహం వేశాను. నా రష్యన్ పాండిత్యం, 'హలోవ్' వరకే. యింతకీ ఆమె లాత్వియన్ భాషలో మాట్లాడిందేమో! బామ్మగారి మాటల్లో, "యిండియా, యిండియా" అన్నమాటలే తెలిశాయి. ఆమె మాంసంతో చేసిన "సాండ్‌విచ్" తింటోంది. "తినవా?" అనడిగింది. తల అడ్డంగా తిప్పేను.

ఈ వయసులో, మన దేశంలో బామ్మలైతే, ఉద్యోగాలు ఎందుకు చెయ్యాలి! చెయ్యరు. కాని, యిక్కడ మనుష్యులు చాలరు – ఎవరిపనులు వాళ్ళకి, ఎవరి ఆర్జన వాళ్ళకీ యిష్టం – అనుకున్నాను. ఇంతలో నా దుబాసీవచ్చాడు. "బామ్మగారు తలచుట్టూ చేతులు తిప్పుతున్నది. గెడ్డాం క్రింద తొండంలా చెయ్యిపెట్టి సైగలు చేస్తున్నది! ఏమిటో చూడు" అన్నాను.

దుబాసీ – కాఫీ తెచ్చుకుని, బామ్మని కదిపేడు .... ఆమె అడిగింది యిదీ .... "నిన్న మీ యిండియానుంచి కొంతమంది నెత్తిమీద టర్బనులు, ముక్కు క్రింద గెడ్డాలూ పెట్టుకుని, అంతెత్తు బూచాళ్ళలాంటివాళ్ళు వచ్చారు చూశావా? నువ్వు! మరినీకు టర్బను, గెడ్డాం లేవేమి?" అన్నదామె కుతూహలం భారతీయత అంటే యీ పంజాబీల గెడ్డాలూ, తలపాగాలూ అనుకున్నదనమాట. [దారా!] నేను చిన్న లెక్చరిచ్చాను. ఇంకా నిద్రమత్తులో వున్న దుబాసీ శ్రీకాంత్ చెప్పాడు – కొంత మింగేశాడు – "లీవిట్ ఐ సే" అన్నాను.

బోసినవ్వుతో మామ్మగారు చేతికున్న చిన్న వాచీ చూసుకుంటూ లేచింది .... "నాది క్లోక్‌రూం డ్యూటీ.... పోతాను,.." అంటూ ఆప్యాయంగా నా తలనిమిరింది. వీపు నిమిరింది. బొజ్జవేపు తర్జనితో చూపించి, "తిండి తిను లేకపోతే నీర్సం వస్తుంది. యిలా సోలిపోతావ్" అంటూ సోలిపోయే భంగిమపెట్టి చూపించింది.

నేను లేచి ఆమెకి స్పసిబా చెప్పి, గౌరవం ప్రదర్శించాను.

"పాపం! ఈ వయస్సులో ఆమెకు ఉద్యోగం," అన్నాను ఇంగ్లీషులో.

"వై పిటీ? షీ లైక్సిట్" అన్నాడు దుబాసీశ్రీ కోపంగా.

ఈ బామ్మగారి చిరునవ్వు నాకు చాలా బలంయిచ్చింది. శిల్పి ఈగార్ వాసిల్యేవ్ గారింట నెహ్రూ, కాళిదాసుల దారు శిల్పాలు చూశాను. ఇండియామీద, ఆయుర్వేదంమీద, శాకాహారంమీద అతనెన్నో ప్రశ్నలు అడిగాడు. తిరుగుదలలో రాత్రి రూము చేరుకున్నాకే మళ్లీ నా బల్లమీద కాఫీపొడి పేకెట్ నన్ను పల్కరించింది. అయ్యో! హాట్‌వాటర్? రష్యన్‌లో ఏమందురు దానిని?

"ఓహ్! నో హాట్ వాటర్?" అనుకున్నాను. పైపుగొట్టాలు రిపేరు చేస్తున్నారుట– రానున్న శీతాకాలంకోసం. ఇది వాళ్ళ సమ్మర్ (అగస్టు నెల) అంచేత వేణ్ణీళ్ళు రావు అని లాత్వియాభాషలో బోర్డు ఎక్కడో పెట్టేరుట– రాత్రి పదకొండు అయినా సూర్యుడింకా మొహం అటువేపు తిప్పుకోలేదు– దుస్తులు మార్చుకుని, మఫ్లర్ మెడలో వేసుకొని–బయటికి వెళ్దామనుకున్నాను .... అంతలో గోడనున్న మేకుకి నా షర్టులు రెండూ నీళ్ళవోడుతూ కనబడ్డాయి. గుండె ఝల్లుమంది – "ఇదేమిరా ఆంధ్రుడా?" అనుకున్నాను. వాటిని తీసి చూశాను....

మన ఫ్రెండు – "రూమ్‌లేడీ–" నా చొక్కాలు – డ్రైక్లీనింగ్ చేయించి, యిండియానుంచి తెచ్చుకున్న చొక్కాలు రెండూ – యించక్కా వుతికి, నీడన వ్రేలాడదీసేసింది. బాత్‌రూంలోకి పోయి చూశాను. నేను ఉదయం వదిలిపెట్టిపోయిన మైసూరు సాండల్‌సబ్బు నామమాత్రంగా మిగిలిఉంది. ఇస్త్రీ చెయ్యకపోగా, ఉతికి పడేసిందా పుణ్యాత్మురాలు. (భాషా! భాషా! నువ్వు పుట్టకముందు మనుషులెలా బ్రతికేవారు?) – యివి అరడం యెట్లా? రేపురాత్రి లెనిన్‌గ్రాడ్ రైలెక్కాలే – దుఃఖపడ్డాను– గట్టిగానే– టెలివిజన్‌లో ఢాం....ఢాం అని యుద్ధం సీను అయిపోతోంది. నా దుఃఖానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లాగా....

పదకొండున్నరయింది. వీధి దీపాలు వెలుగుతున్నాయి అప్పుడే – బయటికి వచ్చాను...ఫ్లోర్‌సెంటర్లో లిఫ్టులప్రక్కన– ఆ అంతస్తు యిన్‌ఛార్జీ అమ్మాయి కూర్చుని, స్వెటర్ అల్లుకుంటూ, టెలివిజన్ చూస్తోంది. ఎదురుగా మేజామీద ఒక హీటర్ వుంది. హీటర్‌మీద కెటిల్లో నీళ్లు మరుగుతూ కనబడ్డాయి.

నా ప్రాణం లేచివచ్చింది. దగ్గరిసా వెళ్లాను. 'ఇహీ' మని నవ్వాను. కానీ లాభంలేకపోయింది–"నాకు అవి కావాలి" అని హీటర్‌వేపు సంకేతించాను. ఆ అమ్మాయి నవ్వలేదు. చేతులు మాత్రం అడ్డంగా వూపుతూ, తన భాషలో యేమో చెప్పింది. నా కర్థమయిందంతా— "అబ్బాయ్! యివి నీకు యివ్వడానికి కాదు, బయటికి నడూ" అని మాత్రమే! ఆ పిల్ల ప్రక్కన లాత్వియా పేపరు "చినా" చూశాను. దాని డాక్ ఎడిషన్‌లో, మొదటి పుటలో, మూడు కాలమ్‌ల "బాక్సు ఐటమ్" వుంది. అందులో నా గురించీ– నేను ఆ పత్రికా కార్యాలయాన్ని చూసినప్పటి విషయాలే వున్నాయి. కాని ఆ అమ్మాయికి– ఆ నేను నేనే అని ఎలా చెప్పడం? కాఫీ దాహం ఎక్కువయింది. వొళ్ళు మండిపోయింది. తిన్నగా, క్రింది ఫ్లోర్‌లో వున్న నా "దుబాసీశ్రీ" రూముకి దిగిపోయాను. టాక్.... టాక్‌మని తలుపు కొట్టాను. వెంటనే తలుపు తియ్యలేదు.... మరింత దుఃఖం వచ్చింది. డాలర్సు, రూబుల్సు వున్నాయి నా దగ్గిర, కాని ఎందుకూ? ఓ గ్లాసుడు వేణ్ణీళ్ళు లేకపోయాక. దుబాసీశ్రీ బాత్రూంలోంచి యిండియన్

స్టయిల్లో అంటే పైన జుబ్బా లేకుండా, కేవలం నిక్కరు తొడుక్కుని, దర్శనం యిచ్చాడు. "యేం చేస్తున్నావ్?" అన్నాను. వచ్చి చూడమన్నాడు. బాత్రూంలోకి తొంగిచూశాను. సన్‌లైట్ సబ్బు అంటే చాలా యిష్టం అతనికి. అది నేను స్నేహ కానుకగా (సావనీర్) యిచ్చాను. దానితో తన గ్యాబర్డీను ప్యాంటు ఉతుకు తున్నాడు. (మన స్టార్ హోటల్సులో యిలాంటి పన్లు చెయ్యనివ్వరు. చెయ్య నిచ్చినా యెవడూ చెయ్యడు కూడా.... పరువుతక్కువ కదా!)

నేను నా ప్రాబ్లమ్ చెప్పాను. "ఫ్లోర్‌లేడీ అందంగానే వుంది గానీ, అనాకారిగా మాట్లాడింది" అన్నాను. "యంగ్ డెవిల్" అన్నాను.

"నిన్న బాల్‌రూమ్ డ్యాన్సు ఫ్లోరులో రష్యన్ గర్ల్సు అంతా 'లిటిల్ ఏంజిల్స్' అన్నావు? యిప్పుడు డెవిల్స్ అంటు న్నావు?" అన్నాడు సిగరెట్ ముట్టించు కుంటూ తాపీగా దుబాసీశ్రీ. —'ఓ హెల్' అన్నాను నేను.

పాపం, మరో పావుగంటలో, నాతో ఏదో అంతస్తుకి ఎక్కివచ్చాడు– "ఫ్లోర్ లేడీతో పోట్లాడకూడదు మనం– ఆమె గవర్నమెంట్ సర్వెంటు కదా?" అంటూ సణిగాడు త్రోవలో....

ఫ్లోర్‌లేడీ గంభీరంగా వుంది. దుబాసీశ్రీ ఏదో చెప్పాడు ఆ అమ్మా యితో. నా వేపు ముందు కొరకొరా చూసింది. తర్వాత ఫెళ్లున నవ్వింది. గణగణమంటూ మాట్లాడే ఆ అమ్మాయి ఎంత ఆరోగ్యంగా వుంటుందో ఆ పలువరుసే చెబుతోంది కాని, నేను మొహం అప్రసన్నంగా పెట్టాను.

నేను ది గ్రేట్ యిండియా నుంచి వచ్చాను. యిన్ని వేల కిలోమీటర్ల దూరం– మా దేశంలో అయితేనా? అతిథి దేవో భవ! అంటూ ఎన్ని మర్యాదలు చేస్తారో.... ఛీఛీ! యూరోపియన్




కల్చర్ అంటూ నా చూపులతోనే వో లెక్చర్ నిశ్శబ్దంగా దంచేస్తున్నాను నేను.

ఆ అమ్మాయి నవ్వేసరికి, కొరడా దెబ్బ తిన్నట్లయింది. "ఏమయ్యా? మహారచయితా! యీ హీటర్ కావా లన్నావుటా? అది యివ్వరు" అంటూ దుబాసీ పకపకా నవ్వాడు.

ఈలోగా ఆ 'ప్రౌఢ' గోడకున్న అద్దాల బీరువాలోంచి ఓ గ్లాసు హోల్డరు తీసి, అందులో పలుచని గాజుగ్లాసు వుంచి (రీగా గాజుగ్లాసులకి ప్రసిద్ధి) కెటిల్లోనుంచి వేణ్ణీళ్లు దాన్నిండా పోసి, దుబాసీకి యిచ్చింది. ద్రాక్షపళ్లంత కనుగ్రుడ్లు మెరిసేలాగ నవ్వుతూ, నా వేపు చూసింది. అతను అవి నాకిచ్చేడు. 'స్పసీబా' అన్నాను నేను అప్రయత్నంగా.

"ఇంతకీ ఈ హాట్ వాటర్ని యేమంటారో తెలియక, యింత అవస్థ పడ్డాను. నువ్వు చెప్పవు– నాకు ఆ మాటరాదు. దాంతో వచ్చిన రష్యన్ మాటలు కూడా మరిచిపోయాను" అన్నాను దుబాసీని నిందిస్తూ. అతనూ జర్నలిస్టేగా!

"నేను నీకు తర్జుమాదారునేగానీ, మాటలు నేర్పే టీచర్ని కానుగా" అన్నాడు నవ్వుతూ– నా అవస్థని ఎంజాయ్ చేస్తూ.

ఇంతకీ హాట్‌వాటర్ని ఏమనాలో చెప్పనేలేదు. (రష్యన్‌లోనూ లాత్వియా భాషలోనూ కూడా)

ఆ అమ్మాయివేపు చూశాను.... చేతి వేళ్లు గాలిలో గోకుతున్నట్లుగా వూపుతూ, నాక్కూడా గుడ్‌నైట్ చెప్పింది. గొప్ప హాయిగా వుంది నాకు– నేను వెనక్కి తిరిగి, వేడ్నీళ్లు చూపించి, "వీటిని ఏమంటారు?" అంటూ సైగలు చేశాను.

ఓహ్! (చాలా మాటలు మాట్లాడింది) "గరియేచవాదా"– అంది చివర నవ్వుతూ. 'గరియేచవాదా' అంటే, వేణ్ణీళ్లు అన్న మాట! ఆ అమ్మాయి నవ్వుతూనే వుంది. నేను గరియేచవాదా.... గరి యేచవాదా" అని వల్లించుకుంటూ, నా రూము చేరాను.

రూమ్‌లో పంచదార, పాలు లేని యిన్‌స్టెంట్ కాఫీ త్రాగేం నేనూ, దుబాసీ మిత్రుడూ. తర్వాత గుడ్‌బై చెప్పుకున్నాం.

నాకు నిజంగా, హాయిగా నిద్ర పట్టింది– 'గరియేచవాదా' ఎంతపని చేసింది! అన్నట్లు నా "చొక్కా" లింకా ఆరలేదు. ఓ గంట నిద్రపోయాక కొట్టినట్లు తెలివొచ్చింది.... ఉలిక్కి–




పడ్డాను.... రూము తలుపు గడియ పెట్టలేదు— లేట్ పార్టీనుంచి కొందరు సందడిగా తిరిగి రూమ్‌లు చేరుకుంటున్న చప్పుడు కారిడార్‌లో.... "దావుగావా అయిలా" (వీధి)లో దీపాలు వంటరిగా వెలుగుతున్నాయి.

లేచి, గ్లాసుహోల్డరు, గ్లాసూ తీసుకొని, నడవలోకి వచ్చాను. కార్పెట్ మీద కూడా అడుగులు వేస్తుంటే, చలికి జివ్వుమంటున్నాయి. అందమయిన ఫ్లోర్ లేడీ పుస్తకం చదువుకుంటోంది. (తెగ చదువుతారు వీళ్లు) తలఎత్తి, ప్రశ్నార్థకంగా చూసింది. 'స్పసిబా' అన్నాను గ్లాసు అందిస్తూ.... "స్పసీబా ఫర్ గరయేచవాదా" అన్నాను.

"ఇంకా కావాలా?" అని ఎంతో యిదిగా అడిగింది. (అలా అర్థమయింది నాకు)— "వద్దు" అన్నాను.

నా పేరు చెప్పాను— పరిచయం చేసుకుంటున్నట్లు— ఆమె బల్లమీద వున్న 'చినా' అన్న పేపరు తీసి, అందులో నా గురించి పడ్డ అయిటమ్ చూపించి, యిది నేనే.... నేనే.... అంటూ సైగలు చేశాను—

ఆ అమ్మాయి అది క్షణంలో చదివేసింది. లేచి నిలబడి, షేక్‌హ్యాండు యిచ్చింది— తన పేరు "అలెగ్జాండ్రా" అని చెప్పింది— ఇందియా. యిందియా అన్న మాటలే తెలిశాయి నాకు. అనక "గుడ్‌బై"లు చెప్పుకున్నాం.

ఎప్పుడో మూడు గంటలకి నిద్ర పట్టింది నాకు.

ప్రొద్దున్నే నా రూమ్ తలుపు టక్ టక్‌మంటూ చప్పుడవుతోంది. 'ఈ దేశం కాని దేశంలో, ప్రొద్దున్నే— సూర్య భగవానుడు తప్ప నన్ను పలకరించే దెవ్వరా' అనుకుంటూ లేచాను. టైము అయిదున్నరవుతోంది. మెల్లిగా వెళ్లి, తలుపులు సంకోచంగా తెరిచాను.

ఒక్కసారి నిద్రమత్తు దిగిపోయింది. వెలుపలి చలిగాలి రివ్వున వచ్చిందేమో గానీ, అది నాకు వెచ్చగానే తగిలింది....

మెరిసిపోయే బంగారు కురులు భుజాలమీదికి జాలువారుతూ వున్న, దంతం బొమ్మలాంటి— ప్రౌఢ అక్కడ. దానిమ్మపండు గింజల్లాంటి పలువరుస పగుల, వెన్నెలలా నవ్వుతూ నిలబడి వుంది— ఏంబర్ పూసల బ్రేస్‌లెట్ ధరించిన ఆమె కుడిచేత, రకరకాల నగిషీలు చెక్కిన నికిల్‌ప్లేటు గ్లాసు హోల్డరు వుంది. అందులో పల్చని "రీగా" గాజుగ్లాసులో, ఆవిరులు వస్తున్న వేణ్ణీళ్లు, వెండి మలామా వున్న చెంచా వున్నాయి. అవాక్కయిపోయిన నేను తేరుకుని— "ఓహ్!" అన్నాను.

"గరియేచవాదా!" అన్నదామె; గాజు గళాసులో మంచి ముత్యాలు వాలకబోస్తున్నట్లు మంజుల స్వరంతో నవ్వుతోంది ఆ లాత్వియన్ బ్యూటీ అలెగ్జాండ్రా.

—— ——